శివయ్యకు పూజలు చేసేదెలా..?

పురాతన శివాలయం తొలగింపు

● ఆరేళ్లుగా నిర్మాణ దశలోనే


నిర్మాణ దశలో ఉన్న శివాలయం

దామెర : మండల కేంద్రంలోని శివునిబోడు మీద కాకతీయుల కాలం నాటి పురాతన శివాలయం ఉండేది. శివనామస్మరణతో శివునిబోడు మారుమ్రోగుతుంటే పక్కనే ఉన్న గిద్దెచెరువు పరవళ్లు తొక్కుతూ పరవశించేదని ఇప్పటికీ జనం గుర్తు చేసుకుంటున్నారు. ఆ ఆలయంలో శివభక్తులు సోమవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఏటా శివరాత్రి నాడు పూజలు, అర్చన, అభిషేకాలు వైభవంగా నిర్వహించే పరిస్థితి ఉండేది. అదంతా మండల కేంద్రంలోని శివాలయానికి ఉన్న ప్రత్యేకత. కాగా శిథిలావస్థకు చేరిన ఆ ఆలయాన్ని తొలగించి పునర్నిర్మించేందుకు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు 2016లో నిర్ణయించారు. నాటి సర్పంచ్ బిల్ల సరోజినీదేవి ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో శివాలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ బిల్లా రమణారెడ్డితోపాటు మరో ఇద్దరు దాతలు ఇచ్చిన ఆర్థికసాయంతో కలిసి సుమారు రూ.32 లక్షలు ఖర్చు చేసి ఏడాదిపాటు నిర్మాణ పనులు కొనసాగించారు. అనంతరం నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. దీంతో ఆలయం ఆరేళ్లుగా నిర్మాణ దశలోనే ఉంది. పూజలు చేసేందుకు భక్తులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

గ్రామంలో శివలింగం లేకపోవడం అరిష్టం...

శిథిలావస్థలో ఉన్న శివాలయాన్ని తొలగించే సమయంలో శివలింగం, నంది, ఆలయ శిథిలాలను వేద పండితుల సూచన మేరకు గోదావరిలో నిమజ్జనం చేశారు. నాటి నుంచి గ్రామంలో శివలింగం లేని పరిస్థితి నెలకొంది. ఎంతో మహిమ కలిగిన శివలింగాన్ని గోదావరిలో నిమజ్జనం చేసి ఆరేళ్లు పూర్తయినా నూతన శివలింగాన్ని పునఃప్రతిష్ఠించకపోవడం గ్రామానికి అరిష్టమని భక్తులు, వేద పండితులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని శివాలయ నిర్మాణ పనులు పూర్తి చేసి శివునికి పూజలు చేసుకునే భాగ్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిర్మాణాన్ని పూర్తి చేయాలి



గతంలో సోమవారాల్లో, పండుగల సందర్భంగా శివాలయానికి వెళ్లి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించడం ఆనవాయితీగా వచ్చేది. ఆరేళ్లుగా శివాలయంలో పూజలు చేసే పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. శివరాత్రి సందర్భంగా సుదూర ప్రాంతాల్లోని శివాలయాలకు వెళ్లి పూజలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామంలో శివలింగం లేకపోవడం అరిష్టమని ప్రచారంలో ఉంది. త్వరగా పూర్తి చేసి ఆలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

– దామెరుప్పుల జయమ్మ, గ్రామస్తురాలు

త్వరలో పూర్తి చేస్తాం



నేను సొంతంగా సుమారు రూ.30 లక్షల వెచ్చించి ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టా. దాతలు, గ్రామస్తులు కొంత సహకరించారు. నిధుల కొరత కారణంగా పనులు నిలిపేశాం. మిగిలిన పనుల కోసం దాతల సహకారం కోరుతాం. నిధులు సరిపోని పరిస్థితి ఏర్పడితే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సహకారంతో నా సొంత డబ్బు వెచ్చించి పనులు పూర్తి చేయిస్తా. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తాం.

–బిల్లా రమణారెడ్డి, చైర్మన్, దామెర

క్లుప్తంగా

కొండపర్తిలో విద్యుత్ సమస్యకు పరిష్కారం



ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామంలో విద్యుత్ ఓవర్‌లోడ్ కారణంగా నెలకొన్న విద్యుత్ సమస్య పరిష్కారానికి బాటలు పడ్డాయి. సమస్యను పరిష్కరించేలా రెండు సింగిల్ ఫేజ్ 25 కేవీ డీటీఆర్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) జిల్లా కమిటీ డైరక్టర్ కట్కూరి రాజు మండల కేంద్రంలో గతేడాది అక్టోబర్ 12న జరిగిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్)లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖ జిల్లా అధికారులు స్పందించారు. గ్రామంలో సోమవారం కొత్తగా రెండు 25 కేవీ డీటీఆర్‌లు ఏర్పాటు చేసి 11 కేవీ సింగిల్ లైన్ ఫ్యూజ్‌లు బిగించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఓవర్‌లోడ్ కారణంగా విద్యుత్ అంతరాయం కలుగకుండా సమస్యను పరిష్కరించిన విద్యుత్ వినియోగదారుల ఫోరమ్ చైర్మన్‌కు, సభ్యులకు, జిల్లా విద్యుత్ అధికారులకు కట్కూరి రాజు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి


నాగరాజు (ఫైల్)

ఆత్మకూరు : గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని అక్కంపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు నాగనబోయిన మల్లయ్య పెద్ద కొడుకు నాగరాజు (21) ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. నాగరాజు కొద్దిరోజులుగా మోటార్ సైకిల్ కొనడానికి తండ్రిని డబ్బులు అడుగుతున్నాడు. వ్యవసాయంలో దిగుబడి లేదని, అప్పులు ఉన్నాయని తండ్రి సర్దిచెబుతున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన నాగరాజు ఆదివారం ఉదయం ఇంటికి చేరుకుని వాంతులు చేసుకుంటుండగా తల్లి గమనించింది. గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు గుర్తించి కుటుంబీకులు చికిత్స కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. కాగా నాగరాజు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగరాజు మృతదేహాన్ని స్థానిక వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ బొల్లబోయిన రాధ రవియాదవ్, సర్పంచ్ ఎన్కతాల్ల విజయ హంశాల్ సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని వారు ఓదార్చారు.

నేడు గండ్ర దంపతుల పర్యటన

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి దంపతులు మండలంలో నేడు (మంగళవారం) పర్యటించనున్నారు. ఈ మేరకు వారు మండలంలోని మైలారం, జోగంపల్లి, కొప్పుల, వసంతపూర్, గంగిరేణిగూడెం, సూర్యనాయక్‌తండా గ్రామాల్లో పర్యటించనున్నట్టు ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులను ప్రారంభిస్తారని వివరించారు. ప్రజాప్రతినిధులు, శ్రేణులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

16న శివపార్వతుల కల్యాణం

దామెర : ఈనెల 16న మండలంలోని ఊరుగొండ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాల్లో భాగంగా 16న ఉదయం గణపతి పూజ, రుద్రాభిషేకం, అనంతరం శ్రీ లక్ష్మీగణపతి, నవగ్రహ, రుద్రసహిత మహా మృత్యుంజయ హోమం, ఉదయం 11.05 గంటలకు ఎదుర్కోలు, శివకల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 1 గంటకు మహాఅన్నదానం, సాయంత్రం ఊరేగింపు, 17న స్వామి వారికి అభిషేకం, అర్చనలు 18న మహాశివరాత్రి పండుగ నాడు పాతఃకాల అభిషేకాలు, అర్చనలు, జాగరణ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు

ఆత్మకూరు : కాంగ్రెస్ హయాంలోనే పేదలకు సంక్షేమ ఫలాలు అందాయని యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి టి.సందీప్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజల సంక్షేమాన్ని విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తున్నాయని విమర్శించారు. అధిక ధరలతో పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. భవిష్యత్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సుపరిపాలన అందిస్తుందని తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

● బీజేపీ ఆలేరు పాలక్, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి


మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

పరకాల : పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టిస్తామన్న, తదితర హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఆలేరు పాలక్, స్థానిక మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి తెలిపారు. పట్టణంలోని 46, 47 బూత్‌ల పరిధిలోని రాజీపేట కాలనీలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో భిక్షపతి మాట్లాడారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇప్పటికీ అమలు చేయకుండా కాలయాపన చేయడం దుర్మార్గమన్నారు. పేదలకు ఇచ్చిన హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ పాలకులను నిలదీయాలని కోరారు. పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, కొత్తగూడెం అసెంబ్లీ పాలక్ దేవునూరి మేఘనాథ్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ కేటాయిస్తున్న నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ.జయంత్‌లాల్, జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, కౌన్సిలర్లు బెజ్జంకి పూర్ణాచారి, కొలనుపాక భద్రయ్య, మండల ఇన్‌చార్జి మేకల రాజవీరు, పట్టణ నాయకులు గాజుల నిరంజన్, సిరంగి సతీష్, మామిళ్లపల్లి సారంగపాణి, నాగెల్లి రంజిత్, మంద రామేశ్వర్, బలభద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ వనవిహార్‌లో అగ్ని ప్రమాదం



ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని కాకతీయ వన విహార్ పార్కులో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పార్కులో దట్టంగా పెరిగిన వెదురు చెట్లు ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. పొగలు వ్యాపించడంతో అటవీ శాఖ అధికారులు హన్మకొండ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అగ్నిమాపక సిబ్బంది జనార్దన్, రవీందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మనోజ్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పేశారు. పార్కులో సుమారు రెండున్నర ఎకరాల వెదురు వనం కాలిపోయినట్లు ఎఫ్‌ఎస్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

‘ఉపాధి’ కూలీల సంఖ్య పెంచాలి


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ రవి

శాయంపేట : ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని అడిషనల్ డీఆర్‌డీఓ రవి కోరారు. మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ జాబ్ కార్డు అందేలా చూడాలని సూచించారు. అన్ని గ్రామాల్లో 50 మందికి తక్కువ కాకుండా కూలీలకు పనులు కల్పించాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో పేద కూలీలు పని చేసి లబ్ధి పొందేలా అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏపీఓ కీర్తి అనిత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఫ్యాన్ల బహూకరణ



కమలాపూర్ : మండలంలోని గూడూరు జెడ్పీ హైస్కూల్‌కు ఆ గ్రామానికి చెందిన ప్రముఖ న్యాయవాది బండి కళాధర్ సోమవారం 6 సీలింగ్ ఫ్యాన్లు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరెకుల భవన శంకుస్థాపన, సభ వాయిదా


వినోద్‌కుమార్‌తో శివాజీ, వెంకటేశ్వర్‌రావు

దామెర : ఆరెకుల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి శంకుస్థాపన, సభ వాయిదా వేస్తున్నట్లు మండలంలోని ఊరుగొండకు చెందిన ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీ, రాష్ట్ర రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్‌రావు తెలిపారు. రాష్ట్ర ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌ను వారు సోమవారం కలిసి చర్చించి కార్యక్రమ వాయిదా విషయాన్ని ఖరారు చేశారు. అనంతరం మండల కేంద్రంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఈనెల 15న హైదరాబాద్‌లోని భగాయత్‌లో నిర్మించ తలపెట్టిన ఆరెకుల భవనం శంకుస్థాపన, సభను ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసినట్లు ఆయన చెప్పారు. తదుపరి కార్యక్రమ తేదీలను త్వరలో ప్రకటిస్తామని వివరించారు. కుల బాంధవులు, సంఘ సభ్యులు నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో సభ నిర్వహిస్తామని తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



నడికూడ : మండల కేంద్రానికి చెందిన గోనెల బాబు అనారోగ్యంతో మృతి చెందిగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు మొలుగూరి భిక్షపతి సోమవారం పరామర్శించారు. తొలుత నాయకులతో కలిసి బాబు నివాసానికి చేరుకుని బాధిత కుటుంబంతో మాట్లాడారు. బాబు మృతి బాధాకరమన్నారు. బాబు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు మార్త భిక్షపతి, మేఘనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో అమృత్ మహోత్సవ్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాకారులు

కాజీపేట రూరల్: అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కాజీపేట రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఉమెన్స్ అండ్ గర్ల్స్ ఇన్ సైన్స్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూట్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం రైల్వే ఉద్యోగుల పిల్లలు, చిన్నారులు, మహిళా కళాకారులు పాల్గొని భరతనాట్యం, కూచిపుడి, జానపద నృత్యాలు చేశారు. దేశభక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కళాకారులు వెన్నెల, హాస్య, సనాయి కృతి, కనిష్కసాయి, కె.రమాదేవి, పాయల్‌చటర్జీ, చటర్జీ, కల్పిత, పరిణిత, సుష్మిత, అమిత్ భాస్కర్, రేణు, షణ్ముకసాయి, రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎం.రాజయ్య, జి.రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేరస్తుడికి జైలు శిక్ష

ఎల్కతుర్తి: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి హనుమకొండ ఫోర్త్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సరిత సంవత్సరం జైలు శిక్షతోపాటు జరిమానా విధించారు. ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలంలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన ముప్పు లచ్చయ్య అనే వ్యక్తి 2013లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నేరం రుజువు కావడంతో సోమవారం హనుమకొండ ఫోర్త్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సరిత న్యాయవిచారణ చేసి సంవత్సరం జైలుతో పాటు రూ. 1,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

అదానీ కుంభకోణంపై విచారణ జరిపించాలి


నిరసన తెలుపుతున్న నాయకులు

ఖిలా వరంగల్: బడా కార్పొరేట్ గౌతమ్ అదానీ కుంభకోణంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ ఇసుక అడ్డా జంక్షన్ సమీపంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రజాసంక్షేమాన్ని పక్కన పెట్టి కార్పొరేట్ దిగ్గజం అదానీకి ప్రధాని మోదీ కొమ్ముకాస్తూ దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాషుమియా, ఎలేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై పోరాటాలు తప్పవు


మాట్లాడుతున్న మహేష్

ఆత్మకూరు : ప్రజాసమస్యలపై పోరాటాలు తప్పవని వైఎస్సార్‌టీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు జన్నారపు మహేష్ తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని గ్రామాల్లో ప్రజలు సమస్యలతో సతమతమౌతున్నారని తెలిపారు. అనేక హామీలతో ఓట్లు దండుకుని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలను విస్మరించి మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి ఆశయాల మేరకు ప్రజలకు సుపరిపాలన అందించే లక్ష్యంతో పార్టీ ఏర్పడిందన్నారు. బీఆర్‌ఎస్ పాలనతో విసిగిన ప్రజలు వైఎస్సార్‌టీపీ వైపు చూస్తున్నారని తెలిపారు. భవిష్యత్‌లో వైఎస్సార్ టీపీ ప్రభంజనం సృష్టిస్తుందని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి వడ్డెపెల్లి రాజేందర్ పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌పై పోలీసులకు ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కమలాపూర్ : కమలాపూర్ ఉపసర్పంచ్ మౌటం రమేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ బాధితుడితో కలిసి అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లంపల్లి షడ్రక్ ఆధ్వర్యంలో పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం షడ్రక్ మీడియాతో మాట్లాడారు. ఉపసర్పంచ్ మౌటం రమేష్ అతడి అనుచరులైన మౌటం కుమారస్వామి (తండ్రి పేరు సారయ్య), మౌటం కుమారస్వామి (తండ్రి పేరు పెద్దులు)తో కలిసి మండల కేంద్రానికి చెందిన దళిత సామాజికవర్గానికి చెందిన మాట్ల రాజుపై పొలం గట్లు చెడగొట్టాడన్న నెపం మోపి కులం పేరుతో దూషిస్తూ దుర్భాషలాడాడని తెలిపారు. కులం పేరుతో దూషించిన ఉపసర్పంచ్ రమేష్‌తో పాటు అతడికి సహకరించిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని, ఉపసర్పంచ్‌ను పదవి నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది కలకోటి మహేందర్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల వినోద్‌కుమార్, అంబేడ్కర్ సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు చిలువేరు సంపత్, హేమంత్‌కుమార్, పుల్ల శోభన్‌కుమార్, పుల్ల రాజేష్, మాట్ల మహేశ్వర్, శనిగరపు వంశీ, కొయ్యడ అశోక్, సునీల్, ఈసంపెల్లి స్టాలిన్, విజ్ఞాన్, గుంపుల అశోక్, రవితేజ, కుమారస్వామి, మాట్ల దినేష్ పాల్గొన్నారు.

‘హాథ్ సే హాథ్ జోడో’ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : భూపాలపల్లి నియోజకవర్గంలో ఈనెల 21, 22 తేదీల్లో టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి చేపట్టనున్న ‘హాథ్ సే హాథ్ జోడో’ యాత్రలో అన్ని వర్గాల ప్రజలూ పాల్గొని విజయవంతం చేయాలని టీపీసీసీ సభ్యుడు, పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జీ గండ్ర సత్యనారాయణరావు కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి సత్యనారాయణరావు హాజరై మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాలకు లబ్ధి చేకూరిన విషయాన్ని గుర్తు చేసి రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు బాటలు వేయాలని చెప్పారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ముఖ్య ఉద్దేశ్యాన్ని ప్రజలకు వివరించి అవగాహన కల్పించి చైతన్యవంతం చేయాలని తెలిపారు. రాష్ట్రంలో ధరణి పోర్టల్ వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాడాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో మండల నాయకులు చింతల భాస్కర్, చిందం రవి, మారపల్లి రవీందర్, బాసాని రవి, కుమారస్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పార్కింగ్.. ప్రయాణికులకు తిప్పలు


బస్టాండ్ ఎదుట నిలిపిన ద్విచక్ర వాహనాలు

శాయంపేట : మండలంలోని పరకాల–హన్మకొండ జాతీయ రహదారిలోని మాందారిపేట బస్టాండ్ ఎదుట పలువురు ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో బస్సుల కోసం ఎదురు చూసే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ప్రతిరోజూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వ్యాపారస్తులు, ఉద్యోగులు, తదితరులు హనుమకొండ, పరకాల, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు వచ్చి మాందారిపేట బస్టాండ్ ఎదుట వాహనాలు నిలుపుతున్నారంటూ ప్రయాణికులు వాపోతున్నారు. బస్టాండ్ ఆవరణలో వాహనాలు ఉంటుండడంతో తాము ఇబ్బంది పడుతున్నామంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్ ఎదుట వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలి


వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

భీమదేవరపల్లి : అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పుల్ల అశోక్ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి సీడీపీఓ స్వరూపకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కనీస వేతనం అమలు కాక, ఈఎస్‌ఐ, పీఎఫ్ వర్తించక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమానంగా పని చేస్తున్నా అంగన్‌వాడీ ఉద్యోగులకు సరైన వేతనం, ఇతర సదుపాయాలు లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, రమాదేవి, పద్మ, స్వరూప, శోభ, జమున తదితరులున్నారు.

కాంగ్రెస్ బలోపేతంలో యువత కీలకం

ఎల్కతుర్తి : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో యువత కీలకమని ఆ పార్టీ హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి ఆదారి రాజేందర్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ‘యూత్ జోడో–బూత్ జోడో’ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హయంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని చెప్పారు. తెలంగాణ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు పార్టీ అధినేత్రి సోనియా గాంధీకి రుణపడి ఉన్నారని చెప్పారు. రుణం తీర్చుకునే సమయం ఆసన్నమవుతున్న సందర్భంగా యూత్ నాయకులు సమిష్టిగా కృషి చేసి రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యవంతం చేయాలని చెప్పారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం సాధించి అధికారంలోకి వచ్చే దిశగా ప్రణాళికాయుతంగా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హింగె శ్రీకాంత్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సుమన్‌గౌడ్, నాయకులు అంబాల శ్రీకాంత్, గణేష్, రాజు, సుధీర్, రాకేష్, కార్తీక్, చల్లా రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.